స్మరిస్తున్నాడని, మొదటి యువతి తన ప్రియుడ్ని ఎలా మనసు నిండా నింపుకుందో తను అలా సర్వావస్థల్లోను దేవుడ్ని జ్ఞప్తిలో వుంచుకోవాలని.

వెంటనే అతను తన చేతిలోని జపమాలని విసిరేసి లేచి గుళ్ళోకి వెళ్ళిపోయాడు.

## 86. పువ్వులు-నవ్వులు

ఓ గ్రామాధికారి దగ్గర పనిచేసే ఒక పనివాడు నిత్యం భుజాన కావిడితో చెరువుకి వెళ్ళి, రెండు కుండల నిండా నీళ్ళని నింపుకుని తన యజమాని ఇంటికి తీసుకు వెళ్ళేవాడు. ఓ కుండకి చిన్న పగులు వుండటంతో, అతను చెరువు నించి యజమాని ఇంటికి చేరేలోగా దారిలో ఆ కుండలోని నీళ్ళు చుక్క చుక్క ఆ పగులు లోంచి కారిపోయేవి. రెండో కుండలోని నీరు కారకుండా నిండుగా ఇంటికి చేరేది.

ఇలా కొంతకాలం గడిచాక మొదటి కుండ రెండో కుండతో చెప్పింది.

"నన్ను ఏ పనికైతే నియమించారో దాన్ని నేను సక్రమంగా చేస్తున్నాను. కాని నువ్వు సగం నీటిని దారిలో ధారపోస్తూ నీ యజమాని పట్ల విధేయతగా లేవు."

ఆ మాటలకి బాధపడ్డ ఆ రెండో కుండ తనని పనివాడు చెరువుకి తీసుకెళ్ళి నీళ్ళు ముంచాక చెప్పింది.

"నాకు ఎంతో సిగ్గుగా వుంది."

"దేనికి?"ప్రశ్నించాడు నీరు మోసేవాడు.

"గత రెండేళ్ళ నించి నేను నీటిలో సగాన్నే చెరువు నించి తెస్తున్నాను. మిగతా నీటిని దారిలో జార విడుస్తున్నాను. నా యజమానికి నేను పూర్తి న్యాయం చేయడం లేదు కనక నాకు సిగ్గుగా వుంది."

పనివాడు చిన్నగా నవ్వి చెప్పాడు.

"సరే. మనం తిరిగి ఇంటికి వెళ్ళే దారిలో నీ కు ఇరువైపులా ఏం కనబడుతుందో చూడు."

చూస్తే ఆ పగులు కుండకి దారి నిండా రకరకాల పూల మొక్కలు, వాటికి పూసిన రంగురంగుల అందమైన పూలు కనబడ్డాయి.

"చూసావా? ఇవన్నీ నిత్యం నీరుని కార్చే నీ వైపు మాత్రమే పెరిగాయి. నీరు ఒలకనివ్వని కుండ వైపు లేవు. రెండేళ్ళుగా ప్రతిఫలం ఆశించకుండా నువ్వు వాటికి చేసే సేవ వల్లే అవన్నీ పెరిగి కళకళలాడుతున్నాయి. కాబట్టి నువ్వు నిండు కుండ కన్నా గొప్పదానివి. అందుకే నువ్వు కారుతున్నా సరే నిన్ను మార్చలేదు."

నీతి: మన కుటుంబాన్ని మనం మన యజమానిగా భావించి, మనం ఆర్జించేదంతా ఆ యజమానికే చెందాలనుకుంటాం. నిండు కుండ నీటిని తన యజమానికే దాచినట్లు మనం మన సంపాదనని మన కుటుంబ సభ్యులకే ఖర్చు చేస్తాం. ఒక్క పైసా కూడా ఇతరులకి ఇవ్వం. కాని ఈ పగులు కుండలా కొంత అలా మనం ఇతరులకి ఇవ్వగలిగితే, దాని వైపున్న మొక్కలు పెరిగి వాటికి పువ్వులు వుదయించినట్లుగా, మనం బీదవారి మొహాల్లో నవ్వులు చూడచ్చు.

## 87. వర్షాకాలం - ఎండా కాలం

ఓ గ్రామంలోని ఓ ముసలావిడ ఎప్పుడూ విచారంగా ఉండేది. ఓ రోజు ఆ గ్రామం మీంచి వెళ్తున్న ఓ సాధువు ఆవిడని చూసి అడిగాడు.

"దేనికంత విచారంగా ఉన్నావు?"

"స్వామి. నాకిద్దరు కూతుళ్ళు. వాళ్ళిద్దరూ పెళ్ళిళ్ళు అయి వెళ్ళిపోయారు." జవాబు చెప్పింది ఆవిడ.

"కొడుకులు లేరా?" అడిగాడు సాధువు.

"ఒకడున్నాడు."

"నిన్ను బాగా చూసుకుంటాడా?"

"దేవుడి దయవల్ల నాకే లోటు లేకుండా చూసుకుంటాడు."

"మరి ఇంక దేనికి నీకా దుఃఖం?"

"నా పెద్దల్లుడిది ఐసు వ్యాపారం. వర్షా కాలం, చలి కాలాల్లో వాళ్ళకి ఆదాయం ఉండదు. అందుకని విచారం. ఇంక రెండో అల్లుడిది గొడుగుల